'జేఈఈ మెయిన్స్'లో ఎస్‌ఆర్ ప్రభంజనం

- అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు
- అభినందించిన చైర్మన్ వరదారెడ్డి

5


(99.99 శాతం)


(99.95 శాతం)


మండప పునర్నిర్మాణ చిత్రాలను తిలకిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

వేయిస్తంభాలగుడి కల్యాణ మండప పునర్నిర్మాణం అద్భుతం

- త్వరలో భక్తులకు అంకితం
- రూ.60కోట్లతో రామప్ప వద్ద వసతులు
- ఈ ఏడాది నుంచి గిరిజన యూనివర్సిటీ తరగతులు
- వర్సిటీపై అవగాహనకు మేడారం జాతరలో స్టాల్ ఏర్పాటు
- కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి
- వేయిస్తంభాల గుడి కల్యాణ మండపం సందర్శన

హనుమకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చరిత్రాత్మకమైన హనుమకొండలోని రుద్రేశ్వర స్వామివారి వేయిస్తంభాలగుడి కల్యాణమండప పునర్నిర్మాణం ఓ అద్భుతమని, త్వరలోనే పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు అంకితం చేస్తామని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం వేయిస్తంభాల గుడి ఆవరణలోని కల్యాణ మండపాన్ని సందర్శించిన ఆయన మండపాన్ని యథాతథంగా తిరిగి నిర్మించడం గురించి కేంద్ర పురావస్తుశాఖ అధికారుల ద్వారా తెలుసుకున్న ఆయన శిల్పుల నైపుణ్యాన్ని ప్రశంసించారు. స్థపతి శివకుమార్‌తో కలిసి మండపాన్ని సందర్శించిన ఆయన తొలుత ఆలయ ప్రాంగణంలో మండప పునర్నిర్మాణంపై ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించి.. అనంతరం మీడియాతో మాట్లాడారు. విరిగిన స్తంభాల స్థానంలో కొత్తవి చెక్కడం ద్వారా మండపానికి పూర్వ వైభవం తీసుకువచ్చారన్నారు. తెలంగాణలోని ప్రాచీన కట్టడాల మరమ్మతులు, పునర్నిర్మాణానికి కేంద్రప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపునకు కృషి చేసిందని, రామప్ప ప్రాంగణంలో రూ.60కోట్లతో పర్యాటకులకు వసతులు కల్పిస్తున్నామన్నారు. వరంగల్ కోటలో దృశ్య శ్రవణ (పస్సాడ్) ఏర్పాట్లు పూర్తయ్యాయని, గిరిజన పర్యాటక ప్రాజెక్టు కింద ఏజెన్సీ ప్రాంతాల్లో రూ.90కోట్లతో అతిథి గృహాలు, చెరువుల్లో బోట్లు, ఇతర వినోద ఏర్పాట్లు చేస్తోందని వివరించారు. త్వరలో

మిగతా 4వ పేజీలో..

మేడిగడ్డపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ డ్రామాలు

- లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ లబ్ధికి ప్రయత్నాలు
- బీజేపీ పార్లమెంట్ కార్యాలయ ప్రారంభోత్సవంలో కిషన్‌రెడ్డి

వివరాలు : 4లో..

మేడిగడ్డ.. 'లక్ష' అబద్ధాల పుట్ట!

కోటి ఎకరాలకు నీళ్లిచ్చామన్నది బూటకం

- రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి లక్ష ఎకరాలకు కూడా నీరివ్వలేదు
- ముంపుపై 2020లోనే నిర్మాణ సంస్థకు లేఖలు రాసినా పట్టించుకోలేదు
- మేడిగడ్డ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి
- మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి బ్యారేజీ సందర్శన
- గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర మండిపాటు


మేడిగడ్డ బ్యారేజీ 21వ పిల్లర్‌కు ఏర్పడిన పగుళ్లను చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తదితరులు

పిల్లర్ పగుళ్లను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు


భారీగా పగుళ్లు ఏర్పడిన మేడిగడ్డ బ్యారేజీ 21వ పిల్లర్

వరంగల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడిగడ్డ లక్ష అబద్ధాల పుట్ట అని, రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో కోటి ఎకరాలకు నీరందించామని కేసీఆర్ చెప్పిన మాటలు పచ్చి బూటకమని, ఆయన గొప్పలు చెప్పుకొన్నారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీని ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నీటి పారుదలశాఖ, విజిలెన్స్ అధికారులు ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో పాల్గొన్నారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలను ప్రజల ముందు ఉంచేందుకు మేడిగడ్డ పర్యటన చేపట్టామని, లక్ష కోట్లు ఖర్చు చేసి కనీసం లక్ష ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని, కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఇప్పటి వరకు రూ.94వేల కోట్లు ఖర్చు పెట్టారని కేవలం 98వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు మాత్రమే నీరు ఇచ్చారని వివరించారు. ఏటా కరెంట్ బిల్లులకే రూ.10,500కోట్లు ఖర్చవుతుందని, రుణాలు ప్రాజెక్టుల నిర్వహణకు ఇతర ఖర్చులకు సుమారు రూ.25వేల కోట్లు ఖర్చు అవుతుందని, మొత్తం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రూ.2లక్షల కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. 2020లోనే ఈ బ్యారేజీకి ముంపు ఉందని ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణ సంస్థ అయిన ఎల్‌అండ్‌టీకి లేఖ రాశారని అయినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వరుసగా 2021, 2022, 2023లో మేడిగడ్డ బ్యారేజీలో ఎదురైన సమస్యలపైనా హెచ్చరించినా పట్టించుకోపకపోవడంవల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. మేడిగడ్డ అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఒకేరకమైన టెక్నాలజీతో నిర్మించారని, భవిష్యత్తులో వీటికి కూడా ప్రమాదం పొంచి ఉండే అవకాశం ఉందన్నారు. మూడేళ్లలో నిర్మించడం, 8 ఏళ్లలో కూలిపోవడం ప్రాజెక్టు డిజైన్ లోపమేనని, ప్రజాధనాన్ని వృథా చేశారని మండిపడ్డారు.

అన్ని పాపాలకు కారణం కేసీఆరే..

స్వార్థం కోసం కాకుండా.. ఒక్కసారైనా ప్రజలకు మేలు జరిగేలా ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యత నెరవేర్చాలని మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లకు పగుళ్లు స్పష్టంగా కనిపిస్తున్నా దానిని చిన్న సంఘటనగా కేసీఆర్ చెప్పడం బాధాకరమన్నారు. అన్ని పాపాలకు కేసీఆరే కారణమని, తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకొనేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని, ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై మీ వైఖరేంటో శాసనసభలో చెప్పాలని రేవంత్‌రెడ్డి కోరారు. కాళేశ్వరం అవినీతిపై చర్చకు రాకుండా కేసీఆర్ నల్లగొండలో సభ పెట్టుకున్నాడని, కేసీఆర్ కుట్రలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కేసీఆర్ కాళేశ్వరానికే కాదు.. ఇక కాశీకి వెళ్లి సన్యాసం పుచ్చుకోవాల్సిందేనని ఎద్దేవా చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ఇంకా ఎన్నాళ్లు చీకటి పొత్తు పెట్టుకుంటారని ప్రశ్నించారు. మేడిగడ్డ సందర్శనకు బీజేపీ ఎమ్మెల్యేలు వస్తారని అనుకున్నామని, చివరి నిమిషంలో కిషన్‌రెడ్డి ఒత్తిడితో వెనక్కి తగ్గారని ఆరోపించారు. కేసీఆర్ అవినీతికి బీజేపీ నేతలు సహకరిస్తారో.. అవినీతిపై విచారణ చేసే మా ప్రభుత్వానికి సహకరిస్తారో చెప్పాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.





సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

దేశంలోనే కాళేశ్వరం భారీ స్కామ్ : మంత్రి ఉత్తమ్

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలోనే జరిగిన భారీ కుంభకోణం కాళేశ్వరంలోనే జరిగిందని భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. రూ.38వేల కోట్ల ప్రాజెక్టును రీడిజైనింగ్ పేరుతో రూ. 94వేల కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. ప్రాజెక్టు కోసం ఇంకా రూ. 34 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ప్రాజెక్టును కట్టారని ఆరోపించారు. బ్యారేజీని కట్టి నీటిని నిల్వ చేసి ఎన్నికల ముందు పబ్లిసిటీ చేసుకున్నారని ఆరోపించారు. ఇది భారీ కుంభకోణమని, క్రిమినల్ చర్యలు కూడా తీసుకునేందుకు క్యాబినేట్‌లో చర్చిస్తామన్నారు. అక్టోబరు 21న

మిగతా 5వ పేజీలో..

13 మంది ఏసీపీల బదిలీ

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో స్థానచలనం

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 13: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఏసీపీలతో పాటు ఇతర జిల్లాలలో డీఎస్పీలుగా పని చేస్తున్న వారిని కమిషనరేట్‌కు కేటాయిస్తూ రాష్ట్ర డీజీపీ రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 13 మందికి బదిలీ, పోస్టింగ్‌లు కల్పించారు. పోస్టింగ్‌లు పొందిన అధికారులు బుధవారం బాధ్యతలు చేపడుతారు. బదిలీ, పోస్టింగ్‌లు పొందిన వారిలో హనుమకొండ ఏసీపీగా దేవేందర్‌రెడ్డి, హనుమకొండ ట్రాఫిక్ ఏసీపీగా తిరుమల్, నర్సంపేట ఏసీపీగా కిరణ్‌కుమార్, మామునూరు ఏసీపీగా రహమాన్, వర్ధన్నపేట ఏసీపీగా అంబటి నర్సయ్య, పాల్వంచ డీఎస్పీగా ఆదినారాయణ, జనగామ ఏసీపీగా దామోదర్‌రెడ్డి, భూపాలపల్లి డీఎస్పీగా సంపత్‌రావు, రామగుండం సీసీఎస్ ఏసీపీగా బోజరాజు, మహబూబాబాద్ డీఎస్పీగా తిరుపతి రావు, హుజూరాబాద్ ఏసీపీగా శ్రీనివాస్‌జీ, కరీంనగర్ పీటీసీ ఏసీపీగా డేవిడ్‌రాజులను నియమించారు.

నేడో, రేపో మరి కొంత మంది ఏసీపీలు, డీఎస్పీల బదిలీలు జరుగనున్నాయి. మంగళవారం కావడంతో పోస్టింగ్‌లు పొందినవారు విధుల్లో చేరడానికి వెనుకంజ వేశారు. బుధవారం విధుల్లో చేరుతామని కమిషనరేట్‌కు వస్తున్న ఏసీపీలు వెల్లడించారు.

తల్లీకుమారుడి దారుణ హత్య

- మంత్రాల నెపంతో హతమార్చిన దుండగుడు
- గూడూరులో పట్టపగలు నడిరోడ్డుపై ఘటన


సమ్మక్క (ఫైల్)


సమ్మయ్య (ఫైల్)

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 13: మంత్రాల మూఢనమ్మకం రెండు ప్రాణాలను బలితీసుకుంది. బొల్లెపల్లిలో రెండు కుటుంబాల మధ్యచోటు చేసుకున్న మంత్రాల గొడవ.. పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పలు పంచాయతీలు జరిగిన క్రమంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వెళ్తున్న తల్లి సమ్మక్క (55), కుమారుడు సమ్మయ్య (40)లను ప్రత్యర్థి దారి కాచి, మంగళవారం మధ్యాహ్నం నడిరోడ్డుపై రాడ్డుతో మోది హతమార్చాడు. ఈ ఘటనను చూసి చలించి పోయిన స్థానికులు.. నిందితుడైన శివరాత్రి కుమారస్వామిని పట్టుకుని దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో 365 జాతీయ రహదారిపై జరిగిన ఈ ఘటన గురించి పోలీసులు, బంధువుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

గూడూరు మండలం బొల్లెపల్లి గ్రామానికి చెందిన ఆలకుంట్ల సమ్మక్క-కొమురయ్య దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. కూలీ పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. కుమారుడు సమ్మయ్య ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ శివరాత్రి కుమారస్వామి కుటుంబసభ్యులు తరుచుగా అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ క్రమంలో సమ్మక్క తమ కుటుంబసభ్యులపై మంత్రాలు చేశారనే అనుమానంతో ఇటీవల కాలంలో పలుమార్లు గొడవలు జరిగాయి. చివరకు పోలీస్‌స్టేషన్‌లో కూడా ఇరువురు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. తాజాగా మంగళవారం సమ్మక్క, భర్త కొమురయ్య, కుమారుడు సమ్మయ్య, కోడలు రజిత గూడూరు ఠాణాకు వెళ్లి, తమ గోడును చెప్పుకుని బయటకు వచ్చారు.

అనంతరం వారు ఆటోలో తమ ఇంటికి వస్తుండగా.. గూడూరు మండల కేంద్రంలోని 365 జాతీయ రహదారిపై కాసుకుని ఉన్న కుమారస్వామి వారితో ఘర్షణకు దిగి ఒక్కసారిగా రాడ్డుతో దాడి చేశాడు. ఈ ఘటనలో తల్లి సమ్మక్క, కుమారుడు సమ్మయ్యకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. అనంతరం సమ్మక్క భర్త కొమురయ్యపై దాడి చేస్తుండగా, స్థానికులు అడ్డుకోవడంతో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారు. వెంటనే అతడిని గూడూరు సీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు. ఇదే ఆటోలో ప్రయాణిస్తున్న సమ్మయ్య భార్య రజిత భయాందోళనతో పరుగులు పెట్టడంతో ఆమె ప్రాణాలను దక్కించుకుంది.

నిందితుడికి దేహశుద్ధి

గూడూరులో మంత్రాల నెపంతో తల్లి, కుమారుడిని రాడ్డుతో కొట్టి చంపిన శివరాత్రి కుమారస్వామిని స్థానికులు పట్టుకుని, విద్యుత్ స్తంభానికి కట్టి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి, అతడిని వారికి అప్పగించారు. కాగా, సంఘటన స్థలానికి మహబూబాబాద్ డీఎస్పీ తీర్థాల సత్యనారాయణ, గూడూరు సీఐ ఫణిదర్, ఎస్సైలు రాణాప్రతాప్, నగేష్, దిలీప్, ప్రవళిక చేరుకుని ఘటన స్థలిని పరిశీలించారు. దాడికి గల కారణాలపై ఆరా తీశారు. తల్లి, కొడుకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గూడూరు సీహెచ్‌సీకి తరలించారు. మృతుడు సమ్మయ్యకు భార్య రజిత, ఇద్దరు కుమార్తెలు గౌతమి, సాత్విక, కుమారుడు హేమంత్ ఉన్నారు. సమ్మయ్య భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గూడూరు పోలీసులు తెలిపారు.

డీఆర్డీఏ పీడీగా బాధ్యతలు స్వీకరించిన కౌసల్యాదేవి



వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 13: వరంగల్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిగా బది లీపై వచ్చిన కౌసల్యాదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ పి.ప్రావీణ్యను, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎన్నికల బదిలీలో భాగంగా సిద్దిపేట జిల్లాలో విధులు నిర్వహిస్తు న్న కౌసల్యాదేవి వరంగల్ జిల్లాకు వచ్చారు. వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న సంపత్‌రావు జగిత్యాల జిల్లాకు బదిలీపై వెళ్లారు.

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- ప్రణాళికబద్ధంగా కౌంటింగ్ ఏర్పాట్లు జరగాలి
- ఏర్పాట్లను పరిశీలించిన వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 13: రానున్న లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం కావాలని, ఎన్నికల నేపథ్యంలో ప్రణాళికబద్ధంగా కౌంటింగ్ ఏర్పాట్లు జరగాలని వరంగల్ ఎస్సీ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 15- వరంగల్ ఎస్సీ పార్లమెంట్ నియోజకవర్గంలోని వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, పరకాల, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్, భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల సెగ్మెంట్లకు చెందిన కౌంటింగ్ ప్రక్రియను ఏనుమాముల మార్కెట్‌లో నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో మంగళవారం కలెక్టర్‌తోపాటు హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. కౌంటింగ్ జరగడానికి తగు సూచనలు చేశారు. కౌంటింగ్ నిర్వహణకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని, బ్యాలెట్ బాక్స్‌ల భద్రత సీసీ కెమెరాల ఏర్పాటు స్ట్రాంగ్ రూంల ఎంపిక ఓట్ల లెక్కింపు అవసరమయ్యే గదులు అబ్జర్వర్లు మీడియా గదులు వసతులు బారీకేడ్ల ఏర్పాట్లపై అధికారులకు దిశ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, మహేందర్‌జీ, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆర్డీవోలు వాసుచంద్ర, రాంమూర్తి, మార్కెటింగ్ అధికారి ప్రసాద్‌రావు, ఏడు నియోజక వర్గాలకు చెందిన తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, రవికుమార్, ఎక్బాల్, విజయ్‌కుమార్, శ్రీనివాస్, పర్యవేక్షకులు రమేష్, నయబ్ తహసీల్దార్లు అనీఫ్, రంజిత్ పాల్గొన్నారు.


కౌంటింగ్ హాల్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్లు

పోటెత్తిన ఎర్రబంగారం

- ఏనుమాముల మార్కెట్లో దేశీరకం మిర్చి క్వింటా రూ.38వేలు

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 13: వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్ మిర్చి యార్డులో ఎర్ర బంగారం(మిర్చి) పోటెత్తింది. మంగళవారం యార్డుకు సుమారు 40వేలకు పైగా మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. ఈ సీజన్‌లో ఇంత పెద్ద ఎత్తున అమ్మకానికి రావడం ఇదే ప్రథమం. దేశీరకం మిర్చి గరిష్ట ధర క్వింటా రూ.38వేలు, తేజ రకం రూ.21,600, అలాగే 341 రకం రూ.21,300, వండర్‌హాట్ రూ.23వేలు, దీపిక రకం రూ.15వేల ధర పలికింది. అలాగే పత్తికి క్వింటా రూ. 6,535 పలికింది. మక్కలు రూ.2,221, పచ్చి పల్లికాయ రూ.5,600, సూక పల్లికాయ రూ.6,790 పలికింది. ఇదిలా ఉంటే రెండేళ్ల క్రితం మిర్చి క్వింటాకు రూ.50వేలకు పైగా ధరలు పలికిందని, ఈసారి కూడా ఆ ధర వస్తే బాగుండేదని మిర్చి రైతులు వాపోతున్నారు.


వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు

మేడిగడ్డపై కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు

లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ లబ్ధికి ప్రయత్నాలు : బీజేపీ పార్లమెంట్ కార్యాలయ ప్రారంభోత్సవంలో కిషన్‌రెడ్డి

హనుమకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వ్యవహారాన్ని ఉపయోగించుకుని రాజకీయంగా లబ్ధిపొందేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలాడుతున్నాయని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం నగరానికి వచ్చిన ఆయన హంటర్‌రోడ్‌లో బీజేపీ వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మేడిగడ్డ బ్యారేజీ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహరిస్తున్న తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఒకరు కృష్ణా జలాలపై, మరొకరు కాళేశ్వరంపై రచ్చ చేస్తూ లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధిపొందేదుకు ప్రయత్నిస్తున్నాయని, ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి వెళ్లని కేసీఆర్.. మంగళవారం నల్లగొండ జిల్లాలో కృష్ణాజలాలపై ఏర్పాటు చేసిన బహిరంగ సభకు వెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే కేసీఆర్ సభకు ప్రతిగా సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలను వెంటేసుకొని మేడిగడ్డ వెళ్లారని, అసెంబ్లీని బంద్ పెట్టి ఆయన మేడిగడ్డకు వెళ్లి ఏంచేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకువస్తే కాళేశ్వరంపై దర్యాప్తు చేయడానికి సీబీఐ సిద్ధంగా ఉందని కేంద్రం గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినా స్పందన లేదన్నారు. ప్రాజెక్టు సర్వే, ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, ఆపరేషన్, నిర్వహణలన్నీ లోపభూయిష్టంగా ఉన్నాయని గతంలోనే తెలిసినా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తోందని, విజిలెన్స్‌తో దర్యాప్తు చేయించినట్టు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోందని, కానీ విజిలెన్స్ ఇచ్చిన నివేదికలో కూడా డ్యామ్ సేఫ్టీ అథారిటీ అధికారులు ఇచ్చిన నివేదికలోని వివరాలే ఉన్నాయన్నారు. దీనినిబట్టి చూస్తే మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వ్యవహారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ధికోసం వాడుకుంటున్నట్టు స్పష్టమవుతోందన్నారు. కేంద్రంపై నిందలు వేస్తూ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడానికే కేసీఆర్ నల్లగొండ సభ పెట్టారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎన్ని డ్రామాలు ఆడినా దేశానికి ప్రధానిగా నరేంద్ర మోదీనే ఉండాలని తెలంగాణ ప్రజలు బలంగా కోరుకుంటున్నారన్నారు. ఈవిలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ మంత్రి గుండె విజయరామారావు, ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, టి.రాజేశ్వర్‌రావు, మురళీధర్‌గౌడ్, పెసరు విజయచందర్‌రెడ్డి, డాక్టర్ కాళీ ప్రసాద్, గుజ్జ సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హనుమకొండలోని వేయిస్తంభాల గుడి ఆవరణలో పునర్నిర్మాణం అయిన కళ్యాణ మండపాన్ని సందర్శించారు.



బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సవం

వేయిస్తంభాలగుడి కల్యాణ మండప పునర్నిర్మాణం అద్భుతం

(3వ పేజీ తరువాయి)

కేంద్ర పురావస్తు చట్టంలో కొన్ని సవరణలు తీసుకురాబోతున్నామని, ఆ చట్టంలోని కఠిన నిబంధనలవల్ల ప్రాచీన కట్టడాలు, ఆలయాల సందర్శనలో, కట్టడాల మరమ్మతు, దేవతామూర్తులకు పూజల నిర్వహణ తదితర విషయాల్లో తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై పర్యాటకులు, భక్తుల మనోభావాలు, స్థానిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్వేచ్ఛగా సందర్శించేలా అవకాశం కల్పిస్తూ సవరణలు చేయాలనుకుంటున్నట్టు వెల్లడించారు. ఇక ములుగు జిల్లాలో రూ.900కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న గిరిజన విశ్వవిద్యాలయం తరగతులను అందుబాటులో ఉన్న భవనాల్లో ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తామన్నారు. విశ్వవిద్యాలయ ఏర్పాటుకు భూసేకరణ పూర్తయిందని, భవన నిర్మాణ పనుల త్వరితగతి పూర్తికి ప్రత్యేక అధికారిని నియమించామన్నారు. దీనిని త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తారన్నారు. ఇక ఈ విశ్వవిద్యాలయంపై అవగాహన కల్పించడానికి త్వరలో జరిగే మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరలో ఓ ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన సమ్మక్క సారలమ్మ గిరిజన జాతరలో ఏర్పాట్లకు కేంద్రం నిధులు ఇస్తోందని చెప్పారు. అంతకుముందు కిషన్‌రెడ్డి వేయిస్తంభాల గుడిలో పూజలు చేయగా.. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ, అర్చకులు గంగు మణికంఠ మంత్రికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. మంత్రి వెంట ఇంటాక్ కన్వీనర్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు, కేంద్ర పురావస్తు శాఖ అధికారులున్నారు.

పురావస్తు అధికారులపై ఫిర్యాదు

కేంద్ర పురావస్తుశాఖ అధికారులపై వరంగల్ కోటకు చెందిన కొందరు స్థానికులు ఫిర్యాదు చేశారు. వరంగల్‌కోట చుట్టూ ఉన్న కట్టను తవ్వి మట్టిని అక్రమంగా తరలిస్తున్నా పురావస్తుశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, మట్టిని ఇష్టారీతిన తవ్వడంవల్ల ప్రాచీన కట్టడాలు కుంగికూలిపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కోటలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని మంత్రికి వివరించారు. అందుకు స్పందించిన మంత్రి.. ఈ విషయమై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మట్టి తవ్వకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన పురావస్తు శాఖ అధికారులను ఆదేశించారు.






ఆర్.దీపాన్ష్ రెడ్డి పి.నిహాల్ శ్రీవాత్సవ్ కె.శ్రీరాం రెడ్డి కె.సిద్ధార్థ రెడ్డి

'జేఈఈ మెయిన్స్'లో ఎస్ఆర్ ప్రభంజనం

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 13: దేశంలోకెల్లా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జేఈఈ మెయిన్స్ 2024 (సీజన్-1) ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో జాతీయస్థాయిలో ఎస్ఆర్ విద్యార్థులు విజయపతాకాన్ని మరోసారి ఎగురవేశారు. జేఈఈ మెయిన్-2024 (సీజన్-1) ప్రవేశ పరీక్షలో ఎస్ఆర్ విద్యార్థులు జాతీయ స్థాయిలో దొంతుల మనీష్ 99.99 శాతం పర్సంటైల్, అలాగే తుమ్మ తేజస్వీ 99.95 శాతం, ఆర్.దీపాన్ష్ రెడ్డి 99.19శాతం, పినిహాల్ శ్రీవాత్సవ్ 99.91 శాతం, కె.శ్రీరాంరెడ్డి 99.91, కె.సిద్ధార్థరెడ్డి 99.77, వడ్లూరి ప్రతీక్ 99.75, వి.సాయి ప్రణతి 99.66, ఉప్పల సూర్యతేజ 99.57, చెన్నకేశవరెడ్డి 99.43, ఎం.శ్రీవల్లీ 99.42, ఎం.చంద్రదీప్ 99.35, కె.సుబ్రమణ్య ఆకాష్ 99.32, వి.వైశాలి 99.31 శాతం పర్సంటైల్ సాధించారు. ఈ సందర్భంగా హనుమకొండలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు జాతీయస్థాయి అత్యుత్తమ పర్సంటైల్ సాధించడం అభినందనీయని, భవిష్యత్‌లో అత్యుత్తమైన ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని తెలిపారు. పరీక్షలు ఏవైనా ఎస్ఆర్ విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయిలో ర్యాంకుల పంట కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన సీఎం పర్యటన

పోలీసుల పటిష్ఠ భద్రత

భూపాలపల్లి, ఫిబ్రవరి 13 : రాష్ట్ర రాజకీయాల్లోనే ఎంతో ఆసక్తిని రేపిన మేడిగడ్డ ప్రాజెక్టులోని లోపాలను, అసలు నిజాలను బయటపెట్టే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి చేపట్టిన మేడిగడ్డ పర్యటన పటిష్ఠ భద్రత మధ్య ప్రశాంతంగా జరిగింది. సోమవారం ఉదయం నుంచే భూపాలపల్లి నుండి మేడిగడ్డ వరకు దాదాపు 800 మంది సాయుధ పోలీసులను మోహరించి అనువ నువున తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా కల్వర్టులు, రోడ్డు వంతెనలు ఉన్న ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రోడ్డు మార్గాన మేడిగడ్డకు వచ్చి వెళ్లడంతో పోలీసు యంత్రాంగం ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించి అటవీ ప్రాంతాల్లో భారీ ఎత్తున కూంబింగ్ నిర్వహించారు. ప్రధానంగా మేడిగడ్డ ప్రాజెక్టు పరిసరాల్లో డ్రోన్ల సహాయంతో భద్రతను పర్యవేక్షించారు. నిరంతరం జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తూ అప్రమత్తం చేశారు. ఇక కాళేశ్వర ముక్తీశ్వర ప్రాజెక్టును ప్రారంభించి తరువాత అప్పటి ప్రభుత్వం బ్యారేజీ సందర్శనలపై అడుగడుగున ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత ప్రాజెక్టులో లోపాలన్ని ఒక్కొక్కటిగా బయటపడుతుంగటంతో రాష్ట్రప్రభుత్వం మేడిగడ్డ ప్రాజెక్టు వ్యవహారంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది.

ఈ క్రమంలో ఇటీవల విజిలెన్స్ నివేదికలను ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యులపై చర్యల కు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో ఇంజనీరింగ్ ఇన్ చీఫ్‌గా వ్యవహరించిన వెంకటేశ్వర్లు పాత్రను గుర్తించి ఆయన్ను రెండు రోజుల కిందట విధుల నుంచి తొలగించారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి మంగళవారం పలువురు మంత్రి వర్గ సహచరులు, కాంగ్రెస్, ఎంఐఎం, సీపీఐ పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శించారు. మధ్యాహ్నం 3:34 గంటలకు మేడిగడ్డకు చేరుకున్న ముఖ్యమంత్రి బృందం నేరుగా బ్యారేజీపైకి చేరుకొని అణువణువు పరిశీలించారు. ఆసమయంలోనూ, అనంతరం బ్యారేజీ సమీపంలో ఇంజనీరింగ్, విజిలెన్స్ అధికారులు ఏర్పాటుచేసిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లోనూ ప్రాజెక్టు నిర్మాణంలో దొర్లిన తప్పులు, జరిగిన అవినీతి రీడిజైన్ పేరుతో నిధుల దోపిడీ లాంటి అంశాలను ఆరా తీసిన సీఎం.. ప్రాజెక్టు నిర్మాణం మొత్తంమీద నిర్మాణ సంస్థ, గత ప్రభుత్వ కుమ్మక్కు వ్యవహారం ఉందనే రీతిలో తీవ్ర వ్యాఖ్యలు చేయడం, దీనిపై అసెంబ్లీలో సుదీర్ఘంగా చర్చిస్తామని సంకేతాలు ఇవ్వడం గమనార్హం.



మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేల బృందం



మేడిగడ్డ బ్యారేజీ వద్ద ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం పర్యటన షెడ్యూల్

మహదేవపూర్ రూరల్/మహదేవపూర్, ఫిబ్రవరి 13 : కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీ ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల పర్యటన మూడున్నర గంటలపాటు సాగింది.

- మధ్యాహ్నం 3.34గంటలకు బ్యారేజీ పరిసరాల్లోకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి
- మధ్యాహ్నం 3.35 గంటలకు మేడిగడ్డ బ్యారేజీ సభా స్థలి నుంచి కుంగిన ప్రాంతానికి బయలు దేరిన సీఎం
- మధ్యాహ్నం 3.40 గంటలకు బ్లాక్-7లో బ్యారేజీ వంతెన మీద కుంగిన ప్రాంతానికి చేరుకుని మధ్యాహ్నం 3.52 గంటల వరకు పరిశీలన
- మధ్యాహ్నం 3.53 గంటలకు బ్యారేజీ వంతెనపై నుంచి గోదావరి రివర్ బెడ్‌లోకి బయలుదేరిన సీఎం
- మధ్యాహ్నం 3.59 గంటలకు గోదావరి రివర్‌బెడ్‌లో బ్లాక్-7లో గల 20వ పిల్లరు వద్దకు చేరుకున్న సీఎం
- సాయంత్రం 4గంటల నుంచి 4.09 గంటల వరకు పగుళ్లు తేలిన 20వ పిల్లరును మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించిన సీఎం
- సాయంత్రం 4.10 గంటల నుంచి 4.25వరకు పగుళ్లు తేలిన పిల్లరు వద్ద మీడియాకు మైక్ ద్వారా వివరాలు వెల్లడించిన మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- సాయంత్రం 4.25 గంటల వరకు గోదావరి రివర్ బెడ్ నుంచి బ్యారేజీ సభావేదిక వద్దకు బయలుదేరిన సీఎం
- సాయంత్రం 4.32 గంటలకు మేడిగడ్డ బ్యారేజీ సభావేదిక వద్దకు చేరుకున్న సీఎం
- సాయంత్రం 4.33 నుంచి సాయంత్రం 4.39 గంటలవరకు వరకు రెస్ట్ , స్నాక్స్ తీసుకున్న సీఎం, బృందం
- సాయంత్రం 4.40 గంటలకు వేదిక వద్దకు చేరుకున్న సీఎం
- సాయంత్రం 4.40 గంటల నుంచి రాత్రి 7. 06 గంటల వరకు కొనసాగిన సీఎం రివ్యూ, పవర్ పాయింట్ ప్రజంటేషన్
- రాత్రి 7.09 గంటలవరకు మేడిగడ్డ నుంచి బయలుదేరి వెళ్లిపోయిన సీఎం

మేడిగడ్డ.. 'లక్ష' అబద్ధాల పుట్ట!

(3వ పేజీ తరువాయి)

మేడిగడ్డ బ్యారేజీ కుంగితో ఇప్పటి వరకు చీఫ్ డిజైనర్, చీఫ్ ఇంజనీర్‌గా చెప్పుకునే కేసీఆర్ ఒక్కమాట కూడా మాట్లాడలేదని ఎద్దేవ చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు కాళేశ్వరం ఫెల్యూర్ ప్రాజెక్టు అని తేల్చారని అన్నారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారుల సూచనలతో ముందుకెళ్తామన్నారు.

తెలంగాణ ప్రజల గుండెకు పగుళ్లు

: ఎమ్మెల్యే కూనంనేని

కాళేశ్వరం ప్రాజెక్టును ఇలా చూడటం బాధాకరంగా ఉందని, ఇవి మేడిగడ్డ పగుళ్లు కాదని, తెలంగాణ ప్రజల గుండెకుఏ ఏర్పడిన పగుళ్లని సీపీఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. మూడేళ్లలో నిర్మించడం, ఎనిమిదేళ్లలో కూలిపోవడం ప్రాజెక్టులో డిజైన్ లోపమేనని ఆరోపించారు. మోతాదుకు మించి నీటిని నిల్వ చేసి కాళేశ్వరం ప్రాజెక్టును నాశనం చేశారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో అతి పెద్ద లోపం ఉందని ఆరోపించారు. నాణ్యత లోపంతో నిర్మించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు కుంభకోణాలతో ప్రజాధనాన్ని వృథా చేసి.. ప్రస్తుత ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ఎగ్గొడుతోందని మాట్లాడటం సిగ్గు చేటన్నారు. లక్ష కోట్లు గోదారిలో పోసినట్లేనని, ఇంకా పదేళ్లయినా ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో రాదని అన్నారు. ప్రభుత్వం నిపుణులతో సంప్రదించి ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకోవాలని సాంబశివరావు డిమాండ్ చేశారు.

పరిశీలిస్తూ.. ప్రశ్నిస్తూ.. విమర్శిస్తూ..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడిగడ్డ పర్యటన ఉత్కంఠగా సాగింది. ఆయన ప్రాజెక్టును ఆసాంతం క్షుణ్ణంగా పరిశీలిస్తూ.. అధికారులను ప్రశ్నిస్తూ.. గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం, అవినీతిపై విమర్శలు చేస్తూ సాగారు. సుమారు మూడున్నర గంటల పాటు ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి పర్యటించారు. మంగళవారం మధ్యాహ్నం 3:34 గంటలకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి మేడిగడ్డ బ్యారేజీకి చేరుకున్నారు. బ్యారేజీపైన 7వ బ్లాక్ వద్ద కుంగిన ప్రాంతాన్ని పరిశీలించిన సీఎం అక్కడే ఉన్న ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి ఎంత మేర భూమిలో కుంగిందనే విషయాన్ని తెలుసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా గోదావరిలోకి వెళ్లి 20వ పిల్లర్ వద్ద పగుళ్లు ఏర్పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. తనతో పాటు వచ్చిన ఎంఐఎం, సీపీఐ ఎమ్మెల్యేలకు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పగుళ్లు ఏర్పడ్డ బ్యారేజీ పిల్లర్లను చూపించారు. ప్రాణహిత నది నుంచి వచ్చే నీటికి మేడిగడ్డ వద్ద అడ్డుకట్ట వేసి ఇక్కడి నుంచి కన్నెపల్లి పంప్‌హౌజ్ ద్వారా అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి ఎల్లంపల్లికి ఏ విధంగా నీటిని పంపింగ్ చేస్తారో సీఎం వివరించారు. సుమారు మూడున్నర గంటల పాటు సాగిన పర్యటనలో సీంతో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావుతో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నీటిపారుదల, తదితర శాఖల ఉన్నతాధికారులున్నారు.



బ్యారేజీ గురించి సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వివరిస్తున్న అధికారులు

తల్లులను తలచి.. తరించి..

మేడారంలో కొనసాగుతున్న ముందస్తు మొక్కులు



ప్రధాన ద్వారం గుండా వస్తున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 13: మహాజాతరకు సమయం ఆసన్నమవుతున్న తరుణంలో రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతోంది. మహాజాతరకు మరికొద్దిరోజులే సమయం ఉన్న నేపథ్యంలో ముందస్తు మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు ఆ తల్లుల చెంతకు తరలొస్తున్నారు. ఈ క్రమంలో వనజాతర ప్రాంగణాలైన ములుగు జిల్లా మేడారం భక్తులతో సందడిగా మారుతోంది. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి.. కల్యాణకట్టలలో తలనీలాలు సమర్పించుకుని గద్దెలకు చేరుకొని అమ్మవార్లకు నేరుగా పూలు, పండ్లు, పసుపు, కుంకుమ చీరె, సారెతో పాటు కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించుకుంటున్నారు. పూజలు చేసి యాట మొక్కులు చెల్లించుకుంటున్నారు. మంగళవారం సుమారు 50వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ మేడారం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం తెలిపారు.

భక్తుల కోసం సకల ఏర్పాట్లు

మేడారం తరలివస్తున్న భక్తుల కోసం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. గద్దెల వద్ద దర్శన సమయంలో ఎవరైనా తప్పిపోతే వెంటనే దేవాదాయ శాఖ సమాచార కేంద్రం(మంచె) వద్దకు వచ్చి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందేలా ఏర్పాట్లు చేశారు. మైకుల ద్వారా వారి వివరాలను ప్రకటిస్తుండటంతో వారు తమ కుటుంబ సభ్యులను సులువుగా చేరుకుంటున్నారు.

1500 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు

ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజులపాటు వైభవంగా జరిగే మేడారం సమ్మక్క సారలమ్మల మహాజాతరకు వచ్చే వాహనాల కోసం రోడ్లు, పార్కింగ్ స్థలాల పనులు పూర్తయ్యాయి. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మేడారంతో పాటు రోడ్లను యుద్ధప్రాతిపదికన నిర్మిస్తున్నారు. మహాజాతరకు 5లక్షల పైగా వాహనాల్లో భక్తులు తరలొస్తారనే పోలీసు అధికారుల అంచనాలు, సూచనలతో రూ.80లక్షలతో కన్నెపల్లి, నార్లాపూర్, ఎలుబాక, పడిగాపూర్, లలో 1500 ఎకరాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. అలాగే ప్రధాన రహదారులతో పాటుగా పార్కింగ్ స్థలాల వద్ద మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర పనులను పూర్తిచేశారు.



మేడారంలో వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

భక్తుల విశ్వాసం పెంపొందించాలి

- పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- మేడారంలో పలు శాఖల అధికారులతో సమావేశం

మేడారం, ఫిబ్రవరి 13: మేడారం సమ్మక్క సారలమ్మల మహాజాతర గొప్పతనాన్ని భక్తుల విశ్వాసాన్ని పెంపొందించాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మేడారంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.శరత్, ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్‌లతో కలిసి పర్యటించిన మంత్రి పలు శాఖల అధికారులతో మేడారం హరిత హోటల్ సమావేశం గదిలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ సుదూర ప్రాంతాల నుంచి మేడారం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యంగా జంపన్నవాగు పరిసర ప్రాంతాలలో ఎలాంటి ప్రాణనష్టం జరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రమాద స్థలాలను గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచానికే తెలిసేవిధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పార్కింగ్ స్థలాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సైన్ బోర్డులు, ఫ్లడ్‌లైట్లు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర అన్ని ఏర్పాట్లను చేయాలన్నారు. కళ్యాణ కట్టల్లో నాయిబ్రాహ్మణులు భక్తుల నుంచి అధిక మొత్తం వసూలు చేయకుండా ఒకే మొత్తం నిర్ణహించాలన్నారు.

అనంతరం గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.శరత్ మాట్లాడు తూ.. మేడారం జాతరలో జంపన్నవాగు, చిలకల గుట్ట, అమ్మవార్ల గద్దెల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. మహాజాతర విధులు నిర్వర్తించే సిబ్బంది ఎవరికి కేటాయించిన స్థానాలలో మాత్రమే విధులు నిర్వర్తించేలా సెక్టోరియల్ జోనల్ అధికారులు చూడాలని అన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం రూ. 105 కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. జాతరలో సంబంధిత శాఖల ప్రోటోకాల్ అధికారులను ఏర్పాటు చేసే విధంగా చూడాలని జిల్లా ఎస్పీ శబరీష్‌ను కోరారు. జాతర పరిసర గ్రామాల్లో మూగ జీవాల కు ఎలాంటి హాని కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతరలో భక్తులకు వైద్యసేవలు అందుబాటులో ఉండేలా 40 బైక్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం మంత్రి అధికారులతో కలిసి వనదేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నా రు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ, ఏటూరునాగారం అదనపు ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, జిల్లా అటవి శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, దేవాదాయ శాఖ మేడారం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం, జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

కమిషనరేట్ నుంచి ఇన్‌స్పెక్టర్ బదిలీ

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 13: వరంగల్ పోలీసు కమిషనరేట్ వెయిటింగ్‌లో ఉన్న జె. వెంకటరత్నం నుంచి ఖమ్మం జిల్లాకు బదిలీ చేస్తూ మల్టీ జోన్ ఐజీ తరుణ్‌జోషి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన బదిలీలలో వెంకటరత్నం పరకాల నుంచి వరంగల్ కమిషనరేట్‌కు అటాచ్ అయ్యారు. ప్రస్తుతం పోస్టింగ్ కోసం రిజర్వ్‌లో ఉండగా ఆయనను ఖమ్మం జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



బంగారు నాణెంపై అబుదాబి ఆలయ నమూనా

మట్టెవాడ, ఫిబ్రవరి 13: నేడు యూఏఈ అబుదాబిలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్న హిందు దేవాలయాన్ని ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో వరంగల్ ఎల్లమ్మ బజార్‌కు చెందిన స్వర్ణకారుడు కత్రోజు యాదగిరి ఆలయ నమూనాతో బంగారు నాణెంను తయారు చేశారు. 22.7 వ్యాసము, 7.000 గ్రాముల బరువు కలిగిన నాణెంపై ఒక వైపు శ్రీస్వామి నారాయణ, మరోవైపు ఆలయం నిర్మాణాన్ని చెక్కారు. ఈ మందిరం 108 అడుగుల ఎత్తు, 262 అడుగుల పొడవు, 180 అడుగుల వెడెల్పుతో 27 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు, దీనికి నాణెంపై చెక్కడం ఆనందంగా ఉందని యాదగిరి పేర్కొన్నాడు.



ఈవీఎంలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఈవీఎంలు తనిఖీ చేసిన కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 13: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఏనుమాముల మార్కెట్ యార్డులో ఈవీఎంల మొదటి దశ తనిఖీలను కలెక్టర్ పి.ప్రావీణ్య పరిశీలించారు. మంగళవారం ఈవీఎంల తనిఖీని అధికారులు, వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో కొనసాగుతున్న మొదటి దశ తనిఖీలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్‌డీవో వాసుచంద్ర, తహసీల్దార్ ఎక్బాల్, డీపీఆర్‌వో ఆయుబ్ అలీ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ రేఖకు డాక్టరేట్



మామునూరు, ఫిబ్రవరి 13 : అసిస్టెంట్ ప్రొఫెసర్ రేఖ గంగులకు డాక్టరేట్ పొందినట్లు వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న రేఖకు విజయ వాడ కేఎల్ (కోనేరు లక్ష్మయ్య) యూనివర్సిటీ పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేసినట్టు వివరించారు. సెక్యూరింగ్ ఐఓటీ నెట్ వర్క్స్ బై ఎవల్యూటింగ్ థేర్ పెర్ఫార్మెన్స్ విత్ మిషన్ లెర్నింగ్ అప్రోచేస్ ఫర్ నెట్ వర్క్స్ ఇంట్రూజన్ డిటెక్షన్ పేరుతో రేఖ పీహెచ్‌డీ పరిశోధనలు చేసి కేఎల్‌యూ పరీక్షల విభాగానికి సమర్పించినట్లు ప్రసాదసారావు తెలిపారు. సీఎస్ఈ అసోసియేట్ ప్రొఫెసర్ వి.మురళి మోహన్ పర్యవేక్షణలో పరిశోధన కొనసాగించారన్నారు.

మార్చి 20న హైదరాబాద్‌లో డాక్ ఆదాలత్

గిర్మాజిపేట, ఫిబ్రవరి 13 : రాష్ట్రంలోని తపాలా సేవలపై ఫిర్యాదుల పరిష్కారానికి మార్చి 20న హైదరాబాద్ అబిడ్స్‌లోని డాక్ సదన్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు వరంగల్ తపాలా డివిజన్ సూపరింటెండెంట్ ఎస్.వి.ఎల్.ఎన్.రావు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. వరంగల్ తపాలా డివిజన్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ జిల్లాలలోని తపాలా సేవలపై ఏమైనా ఫిర్యాదులుంటే వాటిని కె.శ్రీకాంత్, అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాఫ్ అండ్ విజిలెన్స్), పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం, హైదరాబాద్-500001 చిరునామాకు పంపించాలని, కవర్‌పై 45వ డాక్ ఆదాలత్ అని రాసి మార్చి 1లోగా పంపించాలని కోరారు.

నేడు వసంత పంచమి

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 13: మాఘ మాసం పంచమి తిథిని పురస్కరించుకొని చదువుల తల్లి సరస్వతీ దేవి అమ్మవారికి వసంత పంచమిగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అమ్మవారి ఆలయాల్లో వసంత పంచమి బుధవారం సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహిస్తారు. నగరంలోని శ్రీభద్రకాళి రోడ్డులోని శ్రీజ్ఞాన సరస్వతీ దేవి పీఠంలో వసంత పంచమిని పురస్కరించుకొని ఆచార్య పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా అమ్మవారి సన్నిధిలో హోమం, అక్షరాభ్యాసాలు, అమ్మవారి రథోత్సవంతో పాటు విద్యార్థులకు బీజాక్షర లేఖనాన్ని ఏర్పాటు చేశారు. వసంత పంచమి సందర్భంగా దత్త క్షేత్రంతో పాటు వాసవీ మాత దేవాలయం, రాజరాజేశ్వరి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

వైభవంగా కుంకుమార్చన

ఘనంగా సాగుతున్న రంగశాయిపేట, కరీమాబాద్‌లో బొడ్రాయి ఉత్సవాలు



రంగశాయిపేట, కరీమాబాద్‌లో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

శంభునిపేట, ఫిబ్రవరి 13: బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా రంగశాయిపేటలో మంగళవారం ఆరువేల మందితో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మంగళవారం కుంకుమ పూజకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో సందడిగా మారింది. యాగశాలలో చతుర్వేదాలతో క్రతువులు నిర్వహించారు. సాయంత్రం జరిగిన ధాన్యాధివాసం, పుష్పాధివాసం కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి గ్రామ దేవతల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య, ఎస్ఐ వెంకన్నలు ఉత్సవాల్లో పాలొనగా ఆర్‌వైఎఫ్ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ కన్వీనర్‌లు కొల్లూరి యోగానంద్, కేడల పద్మజనార్దన్, గుండు చందనపూర్ణచందర్, పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అగ్ని గుండాలు...

ఉత్సవాల్లో భాగంగా మహంకాళీ ఆలయ ప్రాంగణంలో వీరశైవుల ఆధ్వర్యంలో అగ్ని గుండాల కార్యక్రమం బ్రహ్మాండంగా జరిగింది. భక్తులు శరభ శరభ, ఓం నమశ్శివాయ అంటూ నిప్పులపై నడిచారు. కాగా, ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన గ్రామ దేవతల యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం జరగనుంది.

ఇదిలా ఉండగా ఉత్సవాల కు స్థానిక వ్యాపారి కుసుమ కేదారి రూ.2,52,018 లను విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్, కేదారి కుటుంబ సభ్యులు, కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

కరీమాబాద్‌లో..

కరీమాబాద్: కరీమాబాద్ బొమ్మలగుడి ప్రాంతంలో నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు రెండోరోజు వైభవంగా కొనసాగాయి. మంగళవారం బొడ్రాయి విగ్రహాల శోభాయాత్రను నిర్వహించారు. ఈమేరకు విగ్రహాలకు భక్తులు, మహిళలు మంగళహారతులు పట్టారు. అనంతరం పురోహితులు యాగశాల సమీపంలో బొడ్రాయి విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన పూజా కార్యక్రమాలను నిర్వహించారు.



వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మట్టెవాడ, ఫిబ్రవరి 12: వరంగల్ బట్టల బజార్ శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి అభిషేకం, పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో నిర్వహించారు. సుప్రభాత సేవా, నిత్యారాధన, అలంకారం, హారతి తదితర పూజా కార్యక్రమాలు అర్చకులు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవేణుగోపాలస్వామి ఆలయ మహిళా భక్త బృందం భగవద్గీత పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రత్నాకర్‌రెడ్డి, చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు, సేవా సమితి సభ్యులు గందె గోవిందరాజులు పాల్గొన్నారు.

'ఇట్లు.. మీ యొక్క చదువు'



లేఖను చూపుతున్న తహసీల్దార్

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 13: వరంగల్ మండల తహసీల్దారు కార్యాలయానికి ఓ వినూత్న రిజిస్టర్ పోస్టు వచ్చింది. ఇట్లు... మీ యొక్క 'చదువు' పేరుతో ఓ అజ్ఞాతవాసి రేషన్ షాపుల కేటాయింపుపై వినతి పత్రం పంపించడంతో అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. తహసీల్దారు కార్యాలయానికి మంగళవారం రిజిస్టర్ పోస్టు వచ్చింది. కవర్‌పై ఫ్రం అడ్రస్ చదువు పేరుతో ఉండటంతో తహసీల్దారు మహ్మద్ ఇక్బాల్ ఓపెన్ చేయగా, ఆరు పేజీల లేఖ ఉంది. చదువుకున్న వాళ్లకు మాత్రమే రేషన్ షాపులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ విషయాన్ని పొందుపర్చారు. తహసీల్దారు మాట్లాడుతూ నిబంధనల ప్రకారమే రేషన్ షాపుల కేటాయింపు జరుగుతుందని, నోటిఫికేషన్ జారీ చేసిన తరువాతనే రేషన్ షాపుల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు లేఖ రాశారని, వచ్చిన రిజిస్టర్ పోస్టుపై ఆరా తీస్తామమన్నారు. కాగా, లేఖ వెనక ఉన్న మతలబు ఏంటని పలువురు చర్చించుకుంటున్నారు.

16న ఆటోల బంద్‌కు పిలుపు



బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

గిర్మాజిపేట, ఫిబ్రవరి 13 : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అమలుచేస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణానికి నిరసనగా 16న రాష్ట్ర వ్యాప్త ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలని మన తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈ.సంజీవ పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ బస్‌స్టేషన్ ఎదుట రాష్ట్ర వ్యాప్త ఆటో బంద్ పోస్టర్‌ను ఆటోడ్రైవర్స్ యూనియన్ నాయకులతో కలిసి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ రెండు నెలల క్రితం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న మహిళలకు ఉచిత ప్రయాణం ఆటో డ్రైవర్ల జీవనానికి ప్రమాదంగా మారిందని వాపోయారు. ఆటోడ్రైవర్లను ఆదుకునేందుకు నెలకు రూ.15వేల జీవనభృతి అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీధర్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎం.బాబు, కె.జయరాం, బి.సంజీవ, జి.స్వామి, పి.బాబు, ఎం.స్వామి, సీహెచ్.కుమార్, బి.దేవేందర్ పాల్గొన్నారు.

నేడు హైదరాబాద్‌కు పోలీసు అభ్యర్థులు : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 13: ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పోలీసు కానిస్టేబుళ్లు సివిల్, ఏఆర్, ట్రాన్స్‌పోర్ట్, ఫైర్, ఎక్సైజ్‌తోపాటు తెలంగాణ ప్రత్యేక పోలీసు విభాగాలు కమిషనరేట్ పరిధిలో ఎంపికైన 982 మంది అభ్యర్థులకు బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తారని కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. మంగళవారం తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశమయ్యారు. 18 ప్రత్యేక బస్సుల ద్వారా హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియానికి తరలించడానికి తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జడ్పీ సీఈవో రాంరెడ్డి, ఏసీపీ సురేంద్ర, కమాండెంట్ ఎస్పీ శివప్రసాద్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు పురుషోత్తం రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

18 నుంచి మేడారం బస్సులు..

గిర్మాజిపేట, ఫిబ్రవరి 13 : వరంగల్ రైల్వేస్టేషన్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక ఆర్టీసీ బస్‌స్టేషన్ నుంచి మేడారం జాతర ప్రత్యేక బస్సులు ఈనెల 18నుంచి ప్రారంభిస్తున్నట్లు హనుమకొండ ఆర్‌టీసీ బస్ డిపో మేనేజర్ బి.ధరమ్ సింగ్ మంగళవారం తెలిపారు. ఇందులో భాగంగా వరంగల్ బస్, రైల్వే స్టేషన్‌ల వైపు వాహనాల రాకపోకలను మంగళవారం నుంచి తాత్కాలికంగా మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు. బస్‌స్టేషన్ నుంచి నడుపుతున్న రూట్ నెంబర్ 1, రూట్ నెంబర్ 11 సిటీ బస్‌లను వరంగల్ హెడ్‌పోస్టాఫీసు, వరంగల్ చౌరస్తా, జేపీఎన్ రోడ్డుల మీదుగా కాకుండా కాశిబుగ్గ, నర్సంపేట రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు. హంటర్ రోడ్డు మీదుగా కాజీపేట వరకు నడిచే రూట్ నెంబర్ 3 బస్సులను అండర్‌బ్రిడ్జి వరకు మాత్రమే నడుస్తాయని తిరిగి ఇక్కడి నుంచే హంటర్ రోడ్డు మీదుగా కాజీపేటకు వెళ్తాయన్నారు. బస్ పాయింట్ నుంచి మేడారం వెళ్ల భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వరంగల్ చౌరస్తా నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వైపు, వెంకట్రామ థియేటర్ జంక్షన్ నుంచి రాంకీ మీదుగా వరంగల్ రైల్వే, బస్‌స్టేషన్‌ల వైపు ఈనెల 25 వరకు ఆటోలు, ద్విచక్ర వాహనాలు తదితర అన్ని రకాల వాహనాల రాకపోకలు పూర్తిగా బంద్ చేసినట్లు తెలిపారు. వాహనాల దారి మళ్లింపులో ప్రజలు, వాహనదారులు సహకరించాలని కోరారు.

'అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి'



సమావేశంలో ప్రసంగిస్తున్న సతీష్‌బాబు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 13: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ నాయకుడు, కో-ఆర్డినేటర్ కుసుమ సతీష్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం శివనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో, తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జి కన్వీనర్ పొట్టి శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో పార్లమెంట్ స్థాయిలో బూత్ సమ్మేళన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సతీష్ మాట్లాడుతూ పార్టీ, మోర్చాల నాయకులు, కార్యకర్తలు బీజేపీ అభ్యర్థుల గెలుపేలక్ష్యంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిమళ్ళ మహేష్, రాష్ట్ర నాయకులు ఎర్రగుల్ల శ్రీనివాస్, గోక వెంకటేష్, భైరి శ్యాంసుందర్ పాల్గొన్నారు.

బోర్‌వెల్ పనులను ప్రారంభించిన ఎంపీపీ

సంగెం, ఫిబ్రవరి 13 : మండలకేంద్రంలోని శాంతి మండల మహిళా సమైక్య కార్యాలయం, ఆరోగ్య ఉపకేంద్రం ఆవరణలో మంగళవారం ఎంపీపీ కందకట్ల కళావతి నరహరి ఆధ్వర్యంలో బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ మండలకేంద్రంలో పలు కార్యాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్య, సొసైటీ డైరెక్టర్ పులి వీరస్వామి, మాజీ రైతుబంధు అధ్యక్షుడు నరహరి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రమేష్, ఆగపాటి రాజు, నాగార్జున పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ లేని వ్యాపారులపై కఠిన చర్యలు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 13: ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా వ్యాపారాలు చేసే కఠిన చర్యలు ఉంటాయని జీడబ్ల్యూఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ రాధిక గుప్తా హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రేడ్ లెసెన్స్ కలిగిన వారు 15వ తేదీలోగా రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు కొనసాగిస్తే మాత్రం భారీ జరిమానాలతో పాటు దుకాణాలను సీజ్ చేస్తామన్నారు.



ఏడీ ఉమారెడ్డికి సమ్మె నోటీసును అందజేస్తున్న నాయకులు

'దోపిడీకి చట్టబద్ధత కల్పించిన కేంద్రం'

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 13: కార్మిక వర్గం పోరాడి తెచ్చుకున్న 29 చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి యాజమాన్యాల దోపిడీకి ప్రధాని మోదీ చట్టబద్ధత కల్పించారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ ఆరోపించారు. 16ననిర్వహిస్తున్న దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం ములుగురోడ్‌లోని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఏడీ డాక్టర్ రావుల ఉమారెడ్డిని కలిసి సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ... దేశంలోని రైతాంగం మోదీ తెచ్చిన మూడు రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 16న దేశ వ్యాప్తంగా జరిగే కార్మిక, పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మెట్టు రవి, ఎస్.సురేష్, ఎస్.రఘు పాల్గొన్నారు.

» ఖిలావరంగల్: లేబర్‌కోడ్‌లతో కార్మిక వర్గానికి పెనుముప్పు రానుందని, 16న జరిగే దేశవ్యాప్త కార్మిక, గ్రామీణ బంద్‌ను ఆల్‌ట్రేడ్ యూనియన్, రాజకీయ పార్టీలు విజయవంతం చేయాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గజ్జెల లింగమూర్తి అన్నారు. మంగళవారం ఆల్‌ట్రేడ్ యూనియన్, వివిధ రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కందిక ఆదికేశవులు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, ఏఐసీటీయూ, ఐఎఫ్‌టీయూ తదితర పార్టీల నాయకులు దండు లక్ష్మణ్, నలిగంటి రత్నమాల, బండి కోటేశ్వర్‌రావు, నర్రా ప్రతాప్, గన్నారపు రమేష్, ముక్కెర రామ స్వామి, గంగుల దయాకర్, పుల్ల రమేష్, రాజు, ఎమ్డీ ఖాసీం, ఎమ్డీ యాకూబ్, దుగ్యాల వేణు, సంపత్‌రెడ్డి, మల్లేశం, శరత్, మహేష్, హనుమంత్‌రెడ్డి, పాశం రవియాదవ్, అశోక్, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఎంసీబీ కమిటీ సభ్యుడికి సన్మానం



వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 13: తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ బిల్డింగ్ (ఎంసీబీ) కమిటీ సభ్యులుగా నియమితులైన డాక్టర్ అజిత్ మహ్మద్‌ను మంగళవారం నగరంలోని సంరక్ష ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ దొడ్డ రమేష్‌కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ దిడ్డి శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. సంరక్ష ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్‌గా ఉన్న అజిత్ మహ్మద్‌ను ప్రభుత్వం మెడికల్ కౌన్సిల్ బిల్డింగ్ కమిటీ సభ్యులుగా నియమించడంపై యాజమాన్యం, సిబ్బంది హర్షం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో డాక్టర్ పోల నటరాజ్, డాక్టర్ బందెల మోహన్‌రావు, కుమార్, శ్రీనివాస్, హరీష్, శ్రావ్య, పోలా మహేష్ పాల్గొన్నారు.

'కమిషనర్‌పై పరువు నష్టం దావా వేస్తాం'

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 13: జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాపై కోటి రూపాయల పరువు నష్టం దావా వేయనున్నట్లు చిన్న వడ్డెపల్లి చెరువు, ఆక్రమణ ఏరియాల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్ వెల్లడించారు. మంగళవారం ఆయన ఎంజీఎం జంక్షన్‌లో మీడియాతో మాట్లాడారు. కొద్ది రోజుల కిందట బల్దియా ప్రజావాణిలో తన సొసైటీని ఉద్దేశించి మాత్రమే కాకుండా తనపై కూడా అభ్యంతరకరంగా మాట్లాడారని పేర్కొన్నారు. దీనిపై కలత చెందిన తాను పరువు నష్టం దావాకు నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్‌లో రెజోనెన్స్ విజయభేరి



హనుమకొండ రూరల్, ఫిబ్ర వరి 13: జేఈఈ మెయిన్స్-2024 సీజన్-1 ఫలితాల్లో హనుమకొం డలోని రెజోనెన్స్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు విజయభేరి మోగించారు. మంగళవారం హ నుమకొండలో కళాశాలలో ఏర్పా టు అభినందన కార్యక్రమంలో రెజోనెన్స్ విద్యాసంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్-2024 సీజ న్-1 ఫలితాల్లో వరంగల్ రెజో నెన్స్ విద్యాసంస్థల నుంచి ఆరుగురు విద్యార్థులు 99 పర్సంటైల్ కంటే ఎక్కువ, 112 మంది విద్యార్థులు 90 పర్సంటైల్‌కు పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. సిహెచ్.ధీరజ్ 99.96 పర్సంటైల్, ఎ.సాయి శ్రీనివాస్ 99.81, టీవీ.సాయి ప్రణీత్ 99.67, డి.శ్రీ తేజ 99.41, వి.చంద్రశేఖర్ 99.31, ఎం.బాల ఆదిత్య 99.15 పర్సంటైల్ సాధించినట్లు వివరించారు. విద్యార్థులను డైరెక్టర్స్ మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, లెక్కల మహేందర్‌రెడ్డిలు అభినందించారు.

ఇన్‌స్పైర్, నేషనల్ సైన్స్‌డేలో ఏకశిల విద్యార్థుల ప్రతిభ

ఖిలావరంగల్, ఫిబ్రవరి 13: ఇన్‌స్పైర్, నేషనల్ సైన్స్‌డే రాష్ట్రస్థాయి పోటీల్లో వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెం దిన ఏకశిల డీజీ స్కూల్ విద్యార్థులు మూడో విభాగాల్లో రాష్ట్రస్థా యి పోటీలకు, రెండు విభాగాల్లో ప్రోత్సాహక బహుమతులను సాధించారని ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిర ుపతి రెడ్డి తెలిపారు. సోమవారం వరంగల్‌లోని సైన్స్ సెంటర్‌లో జరిగి న ఇన్‌స్పైర్, నేషనల్ సైన్స్‌డే సందర్భంగా పోటీలను నిర్వహించారు. ఇందులో కోక లత్రశ్రీ(8వ, తరగతి) అంధులు ప్రమాదాల నుంచి తమను తాము కాపాడుకునే పరికరాన్ని ఆవిష్కరించారన్నారు. అలాగే నేషనల్ సైన్స్‌డేను పురష్కరిం చుకొని ఎమ్డీ నస్రీమ్(9వ తరగతికి) ఎలక్ట్రానిక్ వెస్టేజీని తగ్గించే విధానంపై అనర్గళంగా ఉపన్యసించారని పేర్కొన్నారు. అలాగే కే.సహస్రా(8వ, తరగతి) నీటిని రక్షించాలని చిత్రలే ఖనంలో రాష్ట్రస్థాయిలో రాణించినట్లు తెలిపారు. 9వ, తరగతికి చెందిన చంద్రనయన కవిత, లక్ష్మిశరణ్యలు పాటలకు ప్రోత్సాహక బహు మతులను సాధించారన్నారు.

వారికి డీఈవో వాసంతి మెమొంటో, సర్టిఫికెట్ ఇచ్చి అభినందించినట్లు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం శివనగర్‌లోని ఏకశిల డీజీ స్కూల్‌లో విద్యార్థులను అభినందించారు. డైరెక్టర్ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికి తీసిన ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించిన గైడ్ రజియాసుల్తానా, సింధూరి, శ్రీనివాస్, తదితర ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ లవకుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ కొండల్‌రెడ్డి



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL బుధవారం 14 ఫిబ్రవరి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న డీఈవో

వర్ధన్నపేట, ఫిబ్రవరి 13: వర్ధన్నపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని డి.హిమబిందు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో సత్తా చాటింది. వరంగల్‌లోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో మంగళవా రం 'ఎయిర్ కూలర్ కమ్ వాటర్ కూలర్ ఎట్ ఫంక్షన్ హాల్ అనే ప్రయోగా న్ని ప్రదర్శించగా జిల్లా స్థాయిలో తృతీయ స్థానం లభించింది. జిల్లా వ్యాప్తం గా 598 ఎగ్జిబిట్స్ ప్రదర్శనకు రాగా, గైడ్ టీచర్ కొటం ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఎగ్జిబిట్‌ను హిమబిందు ప్రదర్శించారు. డీఈవో వాసంతి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని విద్యార్థినికి అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయు లు రాపాక సదానందం, నీరటి ఎల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్ది మేడారంలో హుండీల ఏర్పాటు



మద్ది మేడారంలో హుండీలను ఏర్పాటు చేస్తున్న అధికారులు

నల్లబెల్లి, ఫిబ్రవరి 13 : మండలంలోని మద్ది మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర వద్ద కానుకల హుండీలను అధికారులు మంగళవారం ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ అధికారి కవిత మాట్లాడుతూ.. జాతర సమీపిస్తున్నందున ఉన్నతాధికారుల ఆదే శాల మేరకు మద్ది మేడారం జాతర వద్ద హుండీలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్ర మంలో దేవాదాయ శాఖ బాధ్యులు భిక్షమాచారి, ఆర్ఐ రాజేంద్ర ప్రసాద్, పోలీసు సిబ్బంది, జాతర ప్రధాన పూజారి దురిశెట్టి సమ్మయ్య, నాగరాజు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు

ఖానాపురం, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయం లో 7వ వార్షికోత్సవ పూజలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చ కుడు తాడూరి నాగరాజు ఆధ్వర్యంలో అభిషేక, హోమ పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో విగ్రహ దాత కొనతం శ్రీనివాసరెడ్డి-అరుణ దంపతులు, ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి, సొసైటీ సీఈవో ఆంజనే యులు, వెంకటేశ్వర్లు, ఎం.రమేష్, మేర్గు రాజు తూడి కోటి, కీర్తి వీరేష్ పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

ఖానాపురం, ఫిబ్రవరి 13 : మండలంలోని రాగంపేట గ్రామంలో నూతనంగా నిర్మిం చిన గుడిలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 15 వరకు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా మహా గణ పతి పూజ, హోమ పూజలు నిర్వహించారు. బుధవారం అమ్మవారి విగ్రహం ఊరేగిం పు, ధాన్యాదివాసము, ఫల పుష్పాదివాసములు, నిద్రావాహనములు, గురువారం ఉద యం పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆల య నిర్మాణ కమిటీ అధ్యక్షుడు బైరబోయిన ఐలేష్ తెలిపారు. కార్యక్రమంలో కమిటీ బాధ్యులు నూనె వెంకన్న, సంతోష్, ఎల్లయ్య, నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

దుగ్గొండి, ఫిబ్రవరి 13 : మండలంలోని తిమ్మంపేటలో కత్తి సూరయ్య అనే వ్యక్తి మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఆర్ఎంపీ పాలడుగుల సాంబయ్య సూరయ్య దహన సంస్కారాల కోసం మంగళవారం ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఈదుల సుదన్, కొలిపాక సదానందం తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

» బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యువరాజు



నర్సంపేటలో మాట్లాడుతున్న బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యువరాజు

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 13 : దేశ వ్యాప్తంగా ఈ నెల 16న జరగ నున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఆల్ ట్రేడ్ యూనియన్ సమావేశం గుం పెల్లి మునీశ్వర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను కార్పొ రేట్ శక్తులకు ఉపయోగపడే విధంగా సవరణలు చేసి నాలుగు కోడ్‌లు గా మార్చారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కారు చవకగా అమ్ముకున్నారన్నారు. సమ్మె జయప్రదం కోసం ఈ నెల 15న నర్సంపేట పట్టణంలో బైక్ ర్యాలీని నిర్వహించనున్నందున కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశం లో ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం, అనంతగి రి రవి, హన్మకొండ శ్రీధర్, రాజు, సైదయ్య, నాగులు పాల్గొన్నారు.

● వర్ధన్నపేట : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త బంద్, కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ వర్ధన్నపేటలో మం గళవారం ఎస్ఎఫ్‌సీ గోదాం కార్మికులచే సంయుక్త మోర్చా, కిసాన్ మోర్చా నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌కేఎం నాయకులు రాచర్ల బాలరాజు, చిర్ర సూచి, తెలంగాణ ప్రజా నాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెల్లి రవి మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరులను కార్పొరే ట్‌ల పరం చేసిందన్నారు. పది సంవత్సరాల కాలంలో రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రూపొందించిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యం, జలగం సునీల్, భుజంగం, భిక్షపతి, రామ కృష్ణ, వేణు తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట ఏసీపీగా కిరణ్‌కుమార్



నర్సంపేట, ఫిబ్రవరి 13 : నర్సంపేట ఏసీపీగా కిరణ్‌కుమార్ నియామకమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏసీపీల బదిలీల్లో భాగం గా హనుమకొండలో పనిచేస్తున్న కిరణ్‌కుమార్ ఇక్కడికి బదిలీ పై వస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇక్కడ ఏసీపీగా పని చేసిన తిరుమల్ వరంగల్ ట్రాఫిక్ విభాగానికి బదిలీ అయ్యారు. కాగా, ఏసీపీ కిరణ్‌కుమార్ ఒకటి రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

బాల్య వివాహాలు నేరం

రాయపర్తి, ఫిబ్రవరి 13 : బాల్య వివాహాలు జరిపించడం చట్టరీత్యా నేరమని జిల్లా బాలల సంరక్షణ ఇన్‌చార్జి అధికారి రాజు సూచించారు. మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ములుగు జిల్లాకు చెందిన 15 సంవత్సరాల బాలికను రాయపర్తి మండలానికి చెందిన 30 సంవత్సరాల యువకుడు వివాహం చేసుకోగా, వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదే శాల మేరకు బాలికను హాజరు పరిచి స్థానికంగా ఉన్న ఆశ్రమానికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, లీగల్ ఆఫీసర్ సురేష్, కౌన్సిలర్ నరసింహ స్వామి, చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసగిస్తున్న ప్రభుత్వం

» మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, ఫిబ్రవరి 13: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయం నుంచి మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. వరి ధాన్యానికి మద్దతు ధర కంటే రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి నేడు మాట మార్చి ధరలు తగ్గినప్పుడు మాత్రమే బోనస్ ఇస్తామని కాంగ్రెస్ నాయకుడు కోదండరెడ్డి పేర్కొనడం హాస్యాస్పదమని అన్నా రు. మద్దతు ధర లభించని పక్షంలో ప్రభుత్వమే కొంత కలిపి ఇవ్వాలని చట్టంలోనే ఉందని, వీరు కొత్తగా కలిపి ఇవ్వడమేమిటని ఆయన ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. రైతు భరోసా కింద రూ.15వేలు ఇస్తామని అధికారంలోకి వచ్చాక పాత పద్ధతిలోనే అది కూడా అసంపూ ర్తిగా రైతుబంధు నిధులు అందిస్తున్నారని విమర్శించారు. రైతుబంధు ఆర్థిక సహా యం కోసం రైతులు ఇప్పటికి ఎదురు చూస్తున్నారని పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ పాలనలో ప్రభుత్వమే కల్లాల వద్ద ధాన్యం కొనుగోలు చేసిందని గుర్తుచేశారు. ఇచ్చిన హామీలు విస్మరించి మోసపూరిత విధానాలను అవలంబిస్తున్న రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తా..

» టౌన్ సీఐ రమణమూర్తి

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 13: నర్సంపేట మునిసిపల్ అధికారులు, పోలీసుల సమన్వయంతో పట్టణంలో రోజు రోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని టౌన్ సీఐ డి. రమణమూర్తి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వ హించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ని ప్రధాన సెంటర్లలో ప్రతీ రోజు ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నా రు. త్వరలోనే మునిసిపల్ అధికారులతో చర్చించి సమస్యను పరిష్క రిస్తామన్నారు. పట్టణంలో యువత గంజాయి, మద్యం వంటి చెడు వ్యసనాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సారించాలని, గంజాయి మహ మ్మారిని రూపుమాపేందుకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు తారస పడితే వెంటనే 100 నెంబ ర్‌కు సమాచారం అందించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం పని చేస్తున్నారన్నారు. ఎవరైనా చట్టానికి లోబ డి ఉండాలని, అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని సీఐ రమణమూర్తి హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టౌన్ సీఐ రమణమూర్తి

తాండ్ర కుమార్ ఆశయ సాధనకు కృషి చేయాలి : కుమారస్వామి

చెన్నారావుపేట, ఫిబ్రవరి 13: పోరాట యోధుడు తాండ్ర కుమార్ ఆశయాల సాధన కోసం కృషి చేయాలని ఎంసీపీఐ(యూ) పార్టీ కేం ద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం తాండ్ర కుమార్ ద్వితీయ వర్ధంతి వేడుకల కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. పేదల ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేసిన యోధుడని, నీతి, నిజాయితీతో ప్రజల పక్షాన నిలిచిన మహనీయుడు కుమార్ అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, మండల కార్యదర్శి జన్ను రమేష్, బిచ్చానాయక్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి

» ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేష్

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 13: ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి ఇచ్చిన హామీలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యా లయంలో కేశెట్టి సదానందం అధ్యక్షతన మంగళవారం జరిగిన ముఖ్య కార్యక ర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగా న్ని దివాలా తీయించి విదేశీ పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్ట డానికి మూడు నల్ల చట్టాలను రూపొందించిందన్నారు. ఈ క్రమంలో వన్ నేష న్, వన్ మార్కెట్ అంటూ ప్రభుత్వ మార్కెట్లకు పోటీగా ప్రైవేట్ మార్కెట్‌లకు అనుమతించి రైతుల పంటలను దోచుకోవడానికి, సన్న, చిన్నకారు రైతులకు భూమి లేకుండా చేసి కూలీలుగా చేసేందుకు కేంద్రం ప్రయత్నం చేసిందన్నా రు. దీనికి వ్యతిరేకంగా రైతాంగం ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్యమం చేపడితే దిగివ చ్చిన ప్రభుత్వం హామీలు ఇచ్చి మూడేళ్లు కావస్తున్నా అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. రామ మందిరం పేరుతో మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్న మోదీ ప్రభుత్వానికి ప్రజలు గుణ పాఠం చెప్పాలన్నారు. సమా వేశంలో నాయకులు నాగెల్లి కొంరయ్య, కొత్తకొం డ రాజమౌళి, శివకుమార్, రాజన్న, ప్రభు, శివకుమార్ పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అబ్బాస్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నేత అబ్బాస్

నర్సంపేట, ఫిబ్రవరి 13 : బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న మతో న్మాద విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యుడు ఎండి.అబ్బాస్ పిలుపునిచ్చారు. నర్సంపేట పట్టణం లో మంగళవారం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈసంపల్లి బాబు అధ్యక్షతన స్టడీ సర్కిల్ సమావేశాన్ని నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు గడిచిపోతున్నా ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలైన ఎల్ఐసీ, బ్యాంకింగ్, బీఎస్ఎన్ ఎల్, విమానయానం, రైల్వే, బొగ్గు ఉత్పత్తి చేసే సంస్థలను ప్రైవేటు ఎరం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం పూనుకుందన్నారు. దేశంలో మత విద్వేషాలను రగిలిస్తూ పాలన కొనసాగిస్తుందన్నారు. రాబోయే రోజు ల్లో బీజేపీ అధికారంలోకి వస్తే అన్ని రాష్ట్రాల్లో మత కలహాలు జరిగే ప్రమాదం ఉందని అబ్బాస్ ఆందోళన వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి రైతులకు అన్యాయం చేసిందని, విద్య, వైద్య రంగాలకు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. నిరుద్యో గులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమైందని విమర్శించా రు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు కొరబోయిన కుమారస్వామి, నమిండ్ల స్వామి, సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బోజేర్వులో కొండచిలువ హతం



చెన్నారావుపేట, ఫిబ్రవరి 13: మండలంలోని బోజేర్వులో మం గళవారం కొండచిలువను గ్రామస్థులు చంపివేశారు. ఇదే గ్రామా నికి చెందిన ఓ రైతు తన మొక్కజొన్న చేనుకు నీరందిస్తున్న క్ర మంలో కొండచిలువ రైతు కాలుకు చుట్టుకుంటున్న క్రమంలో కేకలు వేయటంతో చుట్టుపక్కల రైతులు వచ్చి కొండచిలువను చంపారు. దీంతో అక్కడ ఉన్న రైతులు ఊరిపి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో బ్యాండ్ మాస్టర్ మృతి



సయ్యద్ (ఫైల్)

ఖానాపురం, ఫిబ్రవరి 13 : మండలంలోని బుధరావుపేటలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానికులు, ఎస్సై బొంగు మాధవ్‌గౌడ్ తెలిపిన ప్రకా రం... గ్రామానికి చెందిన బ్యాండ్ మాస్టర్ షేక్ సయ్యద్(45) తన కుమారుడు యాకుబ్‌తో కలిసి స్థానికంగా ఓ ఇంటి వద్ద బ్యాండ్ వాయించడానికి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో బహిర్భూమికి వెళ్లి వస్తానని కుమారుడికి చెప్పి గ్రామ శివారు లోని పెద్ద మోరీ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా గూడూరు నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న ట్రాలీ వాహనం సయ్యద్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయా లై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. గమనించిన కుమారుడు కేకలు వేయడంతో సంఘటన స్థలానికి చేరుకున్న స్థానికుల సహాయంతో నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్ప త్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సయ్యద్ మృతి చెందినట్లు తెలిపారు. ఆయన కు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు యాకుబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కొండాపూర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి



ఆర్టీసీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, విద్యార్థులు

నల్లబెల్లి, ఫిబ్రవరి 13 : మండలంలోని కొండాపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ నాయకులు, విద్యార్థులు నర్సం పేటకు తరలివెళ్లి డిపో వద్ద ఆర్టీసీ అధికారి సత్యనారాయణకు మంగ ళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండ ల ప్రధాన కార్యదర్శి కడియాల మనోహర్ మాట్లాడుతూ.. ఏజెన్సీ గ్రామం కొండాపూర్‌కు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామానికి వచ్చే రహదారిలో విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతుండగా గ్రామస్థులు విద్యుత్ అధికారుల సహకారంతో సరిచేసినట్లు తెలిపారు. ఆర్టీసీ అధికారులు స్పందించి గ్రామ రహదారిని పరిశీలించి నర్సంపేట - కొండాపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్య క్రమంలో విద్యార్థులు పాల మూర్తి, అజయ్, శివకుమార్, రాజేష్, శ్రీని వాస్, అఖిల, లావణ్య రచన, కావ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షలను ధైర్యంగా రాయాలి

నల్లబెల్లి, ఫిబ్రవరి 13 : త్వరలో జరగబోయే 10వ తరగతి పరీక్షల ను విద్యార్థులు ధైర్యంగా రాయాలని దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి భట్టు సాంబయ్య తెలిపారు. మండలంలోని రంగాపురం గ్రామ ప్రభుత్వ హైస్కూల్‌లో మంగళవారం 10వ తరగతి విద్యార్థుల కు ప్యాడ్లు, పెన్నులను అందించారు. ఈ సందర్భంగా భట్టు సాంబ య్య మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలకు భయపడొద్దన్నారు. సంవ త్సరం మొత్తం చదివినా సిలబస్ నుంచి ప్రశ్నలను అడుగుతారన్నా రు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని కోరారు. కార్య క్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అశో క్, దామోదర్, శ్రీనివాస్,మహేందర్‌రెడ్డి, షైపాల్, శోభన్ పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ తొగర్రాయి గ్రామ కమిటీ నియామకం

దుగ్గొండి, ఫిబ్రవరి 13 : మండలంలోని తొగర్రాయి గ్రామ కాంగ్రెస్ మహిళా కమిటీని మండల కాంగ్రెస్ మహిళా కమిటీ అధ్యక్షురాలు వెండి సక్కుబాయి మంగళవారం ప్రకటించారు. అధ్యక్షురాలిగా కల్వాల శాంత, ఉపాధ్యక్షురాళ్లుగా నల్ల రజిత, లక్క కవిత, ప్రధాన కార్యదర్శిగా గిన్నె లలిత, కోశాధికారిగా కొనకటి శ్రీదేవి, కార్యదర్శిగా బొనగిరి నాగలక్ష్మి, ప్రచార కార్యదర్శిగా కొత్తపెల్లి భారతి, సభ్యులుగా బుసాని భవాని, సాంబరి నాగలక్ష్మి, చల్లా శైలజ, కొలువుల మాధవి, ఎలగొండ పూజిత, కొర్రె కొంరమ్మ, బుడుగొండ లక్ష్మి, కంత్రి ఈశ్వర్, గిన్నె అరుణ, తుమ్మలపెల్లి రచనలను నియమించారు.

ప్రతీ ఒక్కరు సమాజ సేవ చేయాలి : డీఈవో



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో వాసంతి

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 13 : ప్రతీ ఒక్కరు జీవితంలో కొంత సమయాన్ని సమాజ సేవ కోసం కేటాయించి ఆద ర్శంగా నిలవాలని డీఈవో వాసంతి అన్నారు. నర్సంపేట మండలం లక్నేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గోనె మల్లయ్య మెమోరియల్‌ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లా డుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ల వల్ల ప్రతిభను వెలికి తీయ వచ్చన్నారు. విద్యార్థి దశనుంచే మహోన్నతమైన ఆలోచన కలిగి ఉండాలన్నారు. 10వ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం విజేతలకు నగ దుతో పాటు మెమొంటోలను డీఈవో చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మాధురి, డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి, గోనె ఉమాదేవి పాల్గొన్నారు.

'సిద్ధార్థ'లో ఘనంగా స్వయం పరిపాలన



స్వయం పరిపాలన వేడుకలో పాల్గొన్న విద్యార్థులు

చెన్నారావుపేట, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల హైస్కూల్‌లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలను బోధించారు. డీఈవోగా గుగులోతు చిత్రజ, ఎంఈవోగా బానోతు సుమన్, విద్యా సంస్థల చైర్మన్‌గా గొడుగు స్నేహిత, ప్రిన్సిపాల్‌గా కుండె అఖిల్, వైస్ ప్రిన్సిపాల్‌గా జాటోతు అంజలి వ్య వహరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అండె కర్ణాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థు లు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత లక్ష్యంగా చదవాలన్నారు. అనంతరం ఉత్తమ పాఠాలు బోధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జక్కుల జగదీ శ్వర్, మేడి రమేష్‌గౌడ్, కొండపర్తి కృష్ణామోహన్, వల్లా వేణు, గణేష్, పైనాల రాజు, పొన్నం రమేష్, ఆరె రాజు, వీరాచారి, బాలరాజు, వెంకటేశ్వర్లు, కుమార్, శ్రీనువాస్, నామాల స్రుజన, కవిత, ముదరు పద్మ, రోజా, స్వప్న, దొంతి శ్రవంతి పాల్గొన్నారు.

నల్లగొండ సభకు తరలిన బీఆర్ఎస్ నేతలు



రాయపర్తి నుంచి నల్గొండకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాయపర్తి, ఫిబ్రవరి 13 : కృష్ణా నదిపై శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నిర్వహ ణ బాధ్యతలను కేఆర్ఎంబీకీ అప్పగించడాన్ని నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేప ట్టిన చలో నల్గొండ సభకు మంగళవారం రాయపర్తి మండల బీఆర్ఎస్ నాయకులు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రంగు కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్, నాయకులు ఎండీ.నయీం, గారె నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

● వర్ధన్నపేట రూరల్ : బీఆర్ఎస్ అధి నేత కేసీఆర్ చేపట్టిన చలో నల్గొండ సభకు మండల బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. కృష్ణా నది జలాల విషయంలో రాష్ట్ర ప్రభు త్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ తల పెట్టిన ఈ సభకు మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల ముఖ్య నాయకులు తరలివెళ్లారు.